క్లుప్తంగా

మృతుని కుటుంబానికి ఎంపీ ఆర్థిక సాయం



రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీని నమ్ముకున్న వారికి అన్ని వేళలా అండగా ఉంటానని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని లంకెవానిదిబ్బ గ్రామానికి చెందిన కొప్పనాతి పరమేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని ఎంపీ మోపిదేవి శనివారం పరామర్శించి, రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్‌లోనూ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, రాజుకాల్వ సర్పంచ్ తలశిల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

కనుల పండువగా బొడ్డ్రాయి ప్రతిష్ఠ



కర్లపాలెం: మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో శనివారం బొడ్డ్రాయి ప్రతిష్ఠ కనుల పండువగా జరిగింది. ఇందులో భాగంగా గ్రామంలో మూడు రోజుల నుంచి శాంతి హోమాలు, విశేష పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శనివారం ఉదయం ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు బొడ్డ్రాయిని దర్శించుకుని, పూజలు చేశారు.

ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్, ఏజెంట్‌పై కేసు నమోదు

బాపట్లటౌన్: బజాజ్ ఇన్సూరెన్స్ కంపెనీ గుంటూరు బ్రాంచ్ మేనేజర్, బాపట్ల ఏజెంట్‌పై శనివారం కేసు నమోదైంది. వివరాల మేరకు.. పట్టణంలోని చీలురోడ్డుకు చెందిన యండూరి రమేష్ బజాజ్ ఫైనాన్స్ కంపెనీలో తన భార్య మీనాక్షి, తన పేరుతో కలిపి రూ. 2.20 లక్షలకు ఇన్సూరెన్స్ చేశారు. ఇన్సూరెన్స్ చేసే సమయంలో తన భార్యకు క్యాన్సర్ వ్యాధి ఉందని సంబంధిత మేనేజర్, ఏజెంట్‌లకు ముందుగానే చెప్పానని, క్యాన్సర్ బాధితులకు కూడా ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తనను నమ్మించి పాలసీ చేయించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల బాధితుడి భార్య మీనాక్షి మృతి చెందింది. ఇన్సూరెన్స్ క్లెయిమ్ నగదు కోసం.. నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పించుకుని, ప్రస్తుతం క్యాన్సర్ బాధితులకు ఇన్సూరెన్స్ వర్తించదని చెబుతున్నారంటూ ఏజెంట్ నాగవరపు నాగేశ్వరరావు, గుంటూరు బజాజ్ ఫైనాన్స్ మేనేజర్ మాబు సుభానీలపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ షేక్. రఫీ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం



బాపట్లటౌన్ : అలల తాకిడికి యువకుడు మృతి చెందిన ఘటన బాపట్ల మండలంలోని పాండురంగాపురం బీచ్ సమీపంలో చోటుచేసుకుంది. చీరాల మండలం, పాపాయిపాలెం గ్రామానికి చెందిన పులి శ్రీనివాసరావు (37) శనివారం ఉదయం చీరాల మండలం, ఓడరేవు బీచ్‌లో స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి గల్లంతై.. మధ్యాహ్నం విగత జీవిగా బాపట్ల మండలంలోని పాండురంగాపురం గ్రామం సమీపంలోకి కొట్టుకువచ్చాడు. నాలుగు నెలల క్రితం మృతుడి భార్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసై మానసికంగా పులి శ్రీనివాసరావు ఇబ్బంది పడుతున్నాడు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ సింగయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రేపల్లె డివిజన్‌లో ఓటు కోసం 2,928 మంది దరఖాస్తు..

- 1,123 మంది ఓటర్లు మరణించినట్లు గుర్తింపు..
- నూరు శాతం పూర్తయిన ఇంటింటి ఓటరు సర్వే..
- జనవరిలో తుది జాబితా విడుదల
- అప్పటి వరకు ఓటు హక్కు కోసం దరఖాస్తులకు అవకాశం
- వివరాలు వెల్లడించిన ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి



మాట్లాడుతున్న ఆర్డీవో జగన్నాథం పార్థసారథి

రేపల్లె రూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రేపల్లె డివిజన్‌లో ఇంటింటి ఓటరు సర్వే నూరు శాతం పూర్తిచేసినట్లు ఆర్డీవో జగన్నాథం పార్థసారథి చెప్పారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇంటింటి సర్వే ద్వారా బీఎల్వోలు నిర్వహించిన సర్వేలో మృతి చెందిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, డబుల్ ఎంట్రీలను గుర్తించామన్నారు. డివిజన్‌లోని చుండూరులో 58 మంది మృతులు, అమర్తలూరులో 84, వేమూరులో 54, కొల్లూరులో 54, భట్టిప్రోలులో 107, రేపల్లె రూరల్‌లో 70, రేపల్లె మున్సిపాలిటీలో 2, నిజాంపట్నంలో 188, నగరంలో 76, చెరుకుపల్లిలో 430 మంది మృతులను గుర్తించామని ఆర్డీఓ వెల్లడించారు. డివిజన్ మొత్తం మీద 1,123 మంది పేర్లను గుర్తించి, జాబితా తయారు చేశామన్నారు. అదేవిధంగా వేమూరు నియోజకవర్గంలో 161 మంది, రేపల్లె నియోజకవర్గంలో 162 మంది కలిసి డివిజన్‌లో 323 మంది ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. వేమూరు నియోజకవర్గంలో 41, రేపల్లె నియోజకవర్గంలో 110తో కలిసి డివిజన్‌లో 151 డబుల్ ఎంట్రీలుగా గుర్తించామన్నారు. నూతన ఓటు నమోదుకు ఫారం-6 ద్వారా వేమూరు నియోజకవర్గంలో 1,050, రేపల్లె నియోజకవర్గంలో 1,878 మందితో కలిపి డివిజన్‌లో 2,928 మంది దరఖాస్తుచేసుకున్నారని వివరించారు. మృతులు, బదిలీలు, డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించాలని ఫారం -7 ద్వారా వేమూరు నియోజకవర్గంలో 6,52, రేపల్లె నియోజకవర్గం నుంచి 2,328లతో కలిపి డివిజన్‌లో 2,980 దరఖాస్తులు అందాయన్నారు. ఓటరు కార్డులో వివరాల మార్పులకు ఫారం-8 నుంచి వేమూరు నియోజకవర్గంలో 709, రేపల్లె నియోజకవర్గంలో 3,796 మందితో కలిపి మొత్తం 4,505 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. అర్జీలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ జగన్నాథం అన్నారు. తొలగించిన ఓట్లపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా ఓటర్లు, రాజకీయ పార్టీల అభ్యర్థనలను పరిశీలించి, 2024 జనవరిలో తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. అప్పటి వరకు కొత్త ఓటు హక్కు కోసం ఆయా బీఎల్వో కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

హానికర ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి

జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఈబీ విలియమ్స్



మాట్లాడుతున్న జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి విలియమ్స్

బాపట్ల: రంగులు, రసాయనాలతో తయారు చేసే ఆహార పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఈబీ విలియమ్స్ సూచించారు. శనివారం సరస్వతీ స్మారక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విలియమ్స్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం ఏర్పాటుకు ప్రతి విద్యార్థి కృషిచేయాలన్నారు. కొనుగోలు చేసే వస్తువులపై తయారీ సంస్థ పేరు, తేదీ, చివరి తేదీ చూడాలని చెప్పారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు రశీదు పొందాలన్నారు. గ్యాస్ సిలిండర్ సరఫరాకు అధికంగా కోరితే పౌర సరఫరాల శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. వినియోగదాల రక్షణ చట్టం - 2019 గురించి విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను దాసరి ఇమ్మానియేలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దారు ఓంకార్, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, క్లబ్ ఇన్‌చార్జి ఫాతిమా మున్నీసా పాల్గొన్నారు. పౌర సరఫరాల శాఖ రూపొందించిన మేము సైతం పుస్తకాన్ని పాఠశాలకు అందజేశారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో ఇద్దరికి స్థానం



కూసంపూడి దేవేంద్రరాజు



షేక్ కరీమున్నీసా

పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ కోశాధికారిగా ఖాజీపాలెం పార్టీ అధ్యక్షుడు కూసంపూడి దేవేంద్రరాజును, చందోలు ఎంపీటీసీ షేక్ కరీమున్నీసాను జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా నియమించారు. ఈ సందర్భంగా వారిద్దరు శనివారం స్పందించారు. తమ ఎన్నికకు సహకరించిన బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి, జిల్లా అధ్యక్షుడు, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

బాపట్ల అర్బన్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్), జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో విజేతలకు అభినందన సభ స్థానిక సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి నిరంజన్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి బహుముఖ కార్యక్రమాలను ఎస్ఎఫ్ఐ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు కీలకపాత్ర పోషిస్తూ.. సామాజిక బాధ్యతతో చదువుకుంటూ ముందుకు సాగాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు సాంస్కృతిక, కళా రంగాల్లో రాణించాలని కోరారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని అన్నారు. మూఢ నమ్మకాల నిర్మూలనకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు



పిట్టలవానిపాలెం: మండల పరిధిలోని ఆరెమండ్ల పంట కాలువలో తూటికాడ, గుర్రపుడెక్క తొలగింపు శనివారం చేపట్టారు. రైతులు ఇటీవల బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి సాగునీటి సరఫరా సమస్యలపై విన్నవించారు. జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే కాలువలో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపు డెక్కలను తొలగించాలని ఆదేశించారు. తక్షణమే దిగి సంగుపాలెం, కోడూరు గ్రామాల పరిధిలో గల పంట కాలువలో తొలగింపు పనులు చేపట్టారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెచ్చగొట్టే ప్రసంగాలపై చర్యలు తీసుకోవాలి

టీడీపీ నేతలపై వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల ఫిర్యాదు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు

చెరుకుపల్లి: ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో టీడీపీ నాయకులు ప్రజలను రెచ్చగొడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తు విద్వేషాలు సృష్టిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని రేపల్లె నియోజకవర్గ వైసీపీ సోషల్ మిడియా కన్వీనర్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు, అయ్యన్నపాత్రుడు తదితర నాయకులు తెలుగుదేశం పార్టీ సభలలో కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా ప్రసంగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్నదమ్ములుగా కలిసిమెలసి ఉంటున్న ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ అమాయక ప్రజలను వారి రాజకీయ అవసరాలకు వాడుకుంటూ దిగజారుడు రాజకీయాలు చేయటం దురదృష్టకరమన్నారు. రానున్న ఎన్నిల్లో ఓడిపోతామనే భయంతోనే టీడీపీ నాయకులు చిల్లర ప్రసంగాలు చేస్తున్నారని, వారిపై కేసు నమోదు చేసి, తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సై వై.సురేష్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు బడుగు సుధాకర్, మామిళ్లపల్లి శివకోటేశ్వరరావు, అద్దెపల్లి మురళి, మండల కన్వీనర్లు ఈపూరి పాపారావు, మామిడి సుధీర్, అమర్తలూరి ఆనంద్, సిద్దార్థ ఉన్నారు.

వేగంగా 24 గంటల విద్యుత్ సరఫరా పనులు



పిట్టలవానిపాలెం: మండలంలోని నాలుగు గ్రామాలలో త్రీఫేజ్, 24 గంటలు విద్యుత్ సరఫరా పనులను వేగవంతం చేశారు. శనివారం భవనంవారిపాలెం శివారు చోడిపాలెంలో పనులను చేపట్టారు. భవనంవారిపాలెంలో 300 విద్యుత్ స్తంభాలు, 10 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఏఈ చంద్రశేఖర్ తెలిపారు.

జూదరుల అరెస్టు

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని చందోలు పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రాజశేఖర్ వివరాల మేరకు.. పిట్టలవానిపాలెంలోని ఓ ఖాళీ స్థలంలో ఏడుగురు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని, రూ.4,820 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి ధ్యేయం



షాపును ప్రారంభించిన మత్స్యశాఖ సహాయ సంచాలకులు సైదా

యడ్లపల్లి(వేమూరు): మత్స్యకారుల ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, సోంతంగా వ్యాపారం చేసుకోవడానికి మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్ ఏర్పాటు చేయడం జరుగతుందని నిజాంపట్నం మత్స్యశాఖ సహాయ సంచాలకు బి.సైదా తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో అంధ్ర మినీ ఫిష్ రిటైల్ షాపును శనివారం ప్రారంభించారు. యూనిట్‌కు ఖరీదు రూ.3.25 లక్షలు అవుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 40 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కారులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కూచిపూడి మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా సేవలు అజరామరం



నారాయణభట్టును సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

రేపల్లె: మదర్ థెరిస్సా సమాజానికి చేసిన సేవలు అజరామరమని తహసీల్దారు డి.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం మదర్ థెరిస్సా జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. భారతదేశంలో పేదలకు, రోగులకు, అనాథలకు థెరిస్సా చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలన్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ సత్యనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాకి నివాళులు

భట్టిప్రోలు: మదర్ థెరిస్సా 110వ జయంతిని శనివారం భట్టిప్రోలులో నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. జెడ్పీటీసీ టి.ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కె.పిచ్చయ్య శాస్త్రి, మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, పంచాయతీరాజ్ ఏఈ సేతు రామచంద్రరావు, ఈవోపీఆర్డీ టి.ఊహారాణి, మాజీ ఎంపీపీ మాచర్ల హేమ సుందరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల: రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి బీఎస్ నారాయణ భట్టు బాపట్ల పట్టణం శిఖరం వారి వీధిలోని ఫణికుమార్ ఫిజియోథెరపీ కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జువ్వా శివరాం ప్రసాద్ సూచన మేరకు మదర్ థెరిస్సా జయంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ భట్టును బీసీ సంక్షేమ సంఘం నేతలు సన్మానించారు. బాపట్లలో సేవా కార్యక్రమాలకు చిరునామాగా బీఎస్ నారాయణ భట్టు నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, ఎ.నటరాజన్, మారం రవికుమార్, డాక్టర్ ఫణికుమార్, తెల్లమేకల యశ్వంత్, మారం భాను, భాస్కర్, సాంబయ్య, పాశం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్థాయి మరచి విమర్శించ వద్దు

భట్టిప్రోలు: స్థాయిని మరచి టీడీపీ నేత సాయిబాబా ముఖ్యమంత్రిని, మంత్రిని విమర్శించడం తగదని ఎంపీపీ, జెడ్పీటీసీలు దావూరి వెంకట లలితకుమారి, టి.ఉదయ భాస్కరి హితవు పలికారు. శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. వేమూరులో జరిగిన పార్టీ సమీక్షా సమావేశంలో మండలానికి నాలుగు వేల ఓట్లు తొలగించే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని, మంత్రి మేరుగ నాగార్జున అన్నట్లు సాయిబాబా ప్రకటన చేయడం శోచనీయమన్నారు.
మండలస్థాయి కూడా లేని వ్యక్తి మంత్రిపై విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, వైఎస్సాఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ..

పెదకాకాని: దొంగలు పడి 11 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. లూథర్‌గిరి కాలనీకి చెందిన గేరా అమల భర్త చెన్నైలో బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కుమారుడితో కలసి ఆమె పెదకాకానిలోని పుట్టింటిలోనే ఉంటోంది. ఎప్పటిలానే కింద పోర్షన్‌కు తాళాలు వేసి పై పోర్షన్‌లో వారు నిద్రించారు. ఈ నెల 25న పంచాయతీ కుళాయి ద్వారా నీళ్లు పట్టుకునేందుకు కిందకు దిగి చూడగా ఇంటి మెయిన్‌డోర్‌కు ఉన్న తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువా తాళం తీసి లాకర్ ఉన్న బంగారు గాజులు, బ్రాస్‌లెట్, గ్రీన్ కలర్ గోల్డ్ రింగ్, ప్లెయిన్ రింగ్‌లు, బుట్టలు, తీగల పోగులు, పోగులు, కమ్మలు, మంగళ సూత్రం మొత్తం 11 సవర్ల బంగారు ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.1,20,000 ఉంటుందని పేర్కొన్నారు. బంగారు ఆభరణాలు చోరీకి గురికావడంతో పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ది బాపట్ల కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఏకగ్రీవ ఎన్నిక



వెంకటేశ్వరరావుకు సన్మానం

బాపట్ల: బాపట్ల కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గం చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవంగా శనివారం జరిగింది. పాలకవర్గంలోని ఎనిమిది మందిలో ఏడుగురు హాజరయ్యారు. గరినేపూడి వెంకటేశ్వరరావును అనంత నగేష్ ప్రతిపాదించగా, బొమ్మిశెట్టి హరినాథ మురళి బలపరిచారు. ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఎలక్షన్ ఆఫీసర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.లలిత కుమారి, సహాయ అధికారిగా పి.మురళి మోహన్‌రెడ్డి ఎన్నిక నిర్వహించారు . బొమ్మిశెట్టి హరినాథ మురళి, అనంత నగేష్ బాబు, ఇనుప గోళ్ల రంగారావు, బీవీఎస్ శాస్త్రి, జోగి ఆనందరావు, ఆఫీస్ సెక్రటరీ ఎ. రామగోపాల్, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అర్బన్ బ్యాంకు చైర్మన్ ఎన్నిక

బాపట్ల: బాపట్ల అర్బన్ బ్యాంకు చైర్మన్ పదవి ఎన్నిక నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ఆ బ్యాంకు వైస్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరరావు పేర్కొన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో చైర్మన్‌గా పని చేస్తూ చనిపోయిన ప్రసాద్ స్థానంలో వైస్ చైర్మన్ కుంటా రామారావుకు మళ్లీ ఎన్నిక జరిగే వరకు చైర్మన్ బాధ్యతలు అప్పగించారని నరాలశెట్టి పేర్కొన్నారు. ప్రస్తుత చైర్మన్ కె.సత్యనారాయణ చనిపోతే వైస్ చైర్మన్‌కు బాధ్యతలు అప్పగించి, వెంటనే ఎన్నికకు ఏ విధంగా వెళ్తారని ప్రశ్నించారు. చరిత్ర కలిగిన బ్యాంకు పాలకవర్గం విషయంలో ఇష్టమొచ్చినట్లు నిర్ణయాలు తీసుకోవటాన్ని నరాలశెట్టి ఖండించారు.

29న కొల్లూరు మండల పరిషత్తు సమావేశం

కొల్లూరు: మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన సమావేశం జరగనున్నదని తెలిపారు.